సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం ¦ 7 ¦ సెప్టెంబర్ ¦ 2024



జూరాలకు మళ్లీ వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగింది.

వివరాలు 10లో ▸



జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె

రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో చిన్నోనిపల్లె జలదిగ్బంధమైంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.9 /22.0

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9న ఇంటర్వ్యూలు

నాగర్‌కర్నూల్ క్రైం: కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు అర్హులైన వారు ఇంటర్వ్యూలలో పాల్గొనాలని డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజిస్టు, అనస్తీషియా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తామన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అర్హులైనవారు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలను www.nagarkurnool.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు.

డిగ్రీలో ప్రవేశానికి చివరి అవకాశం

కల్వకుర్తి టౌన్: డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు శనివారం చివరి గడువు అని, ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద శార్వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాస్టల్ వసతి ఉందని, దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇతర పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే విశాలవంతమైన క్యాంపస్‌లో బోధన ఉంటుందని, విద్యార్థులు మరిన్ని వివరాలకు కళాశాలకు వచ్చి తెలుసుకోవాలని ఆమె కోరారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

మన్ననూర్: ఆర్‌ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20న ఉదయం 11 గంటల లోపు https//ititelangana.gov.in దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇది వరకు వివిధ ఫేస్‌లలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సీటు రాని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులు తీసుకొని నేరుగా ఆర్‌ఐటీఐ మన్ననూర్ కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు విద్యార్థుల మెరిట్ ప్రాతిపదికన కౌన్సిలింగ్ చేపట్టి సీట్లు కేటాయిస్తామన్నారు.

అచ్చంపేటలో హైడ్రా తరహా కూల్చివేతలు

అచ్చంపేట: అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఇందుకు పట్టణవాసులు సహకరించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు ఆయన హాజరై మాట్లాడారు. ఆస్తి, ట్రేడ్ లైసెన్స్, నీటి పన్నులు ఎగొట్టేవారిని ఉపేక్షించేది లేదన్నారు. పేదలు సకాలంలో బకాయిలు కడుతుంటే ఉన్నతవర్గాలు ఎగొట్టే పనిలో ఉన్నారని, ఇలాంటి వారిని అధికారులు, కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు వెనకేసుకురావొద్దని సూచించారు. రూ. 2.50 కోట్లతో మల్లంకుంటను మినీట్యాంకు బండ్‌గా అభివృద్ధి చేస్తామని, సింగిల్ రోడ్డును డబుల్‌గా విస్తరించి డివైడర్ ఏర్పాటు చేస్తామన్నారు. మల్లంకుంటలో కబ్జాలను హైడ్రా తరహాలో కూల్చివేస్తామని హెచ్చరించారు. అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతామని, ఎంతటి వారున్నా ఉపేక్షించమన్నారు. సీతరాలగుట్ట ప్రభుత్వం భూమి కబ్జా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని, 21 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడుతామన్నారు.

జై జై గణేశా..!





నేటినుంచి వినాయక చవితి ఉత్సవాలు

- విభిన్న ఆకృతుల్లో ముస్తాబైన మండపాలు
- వివిధ ప్రాంతాల నుంచి తరలిన వేలాది విగ్రహాలు

నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: ఆదిదేవుడు గణనాథుడు.. తొమ్మిది రోజులపాటు భక్తులచే పూజలందుకునేందుకు భూలోకం బయలుదేరాడు. శనివారం ఊరూరా.. వాడవాడలా కొలువుదీరనున్నాడు. ఏలోటు రాకుండా ఉత్సవాలు నిర్వహిస్తాం.. లంబోధరా.. మమ్మాశీర్వదించు స్వామీ అంటూ భక్తులు కోరుతున్నారు. ఈ క్రమంలోనే నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకేంద్రంతోపాటు కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ తదితర ప్రాంతాల్లో విభిన్న రూపాల్లో తయారు చేసిన వినాయక విగ్రహాలను భక్తులు కొనుగోలు చేసి మండపాల్లో ప్రతిష్ఠించేందుకు తరలిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు, ఉండ్రాలతో నైవేద్యాలు స్వామివారికి సమర్పించనున్నారు.

మార్కెట్లు కిటకిట

వినాయక చవితి నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మార్కెట్లు ప్రజలతో కిటకిటలాడాయి. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారమే పండుగ సందడి మొదలైంది. విగ్రహాల కొనుగోళ్లతోపాటు పూలు, పండ్ల విక్రయాలు జోరుగా సాగాయి. గత నాలుగు నెలల ముందే రాజస్థాన్, గుజరాత్, బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కళాకారులు జిల్లాలోని ప్రధాన పట్టణాలను కేంద్రాలుగా చేసుకుని వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఉత్సవ కమిటీలు ముందస్తుగా హైదరాబాద్‌తోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో తయారు చేస్తున్న విగ్రహాలను తమకు నచ్చిన ఆకృతిలో తయారు చేయించుకున్నారు. గత వారం నుంచి పెద్దఎత్తున విగ్రహాలను మండపాలకు తరలిస్తున్నారు.

పోటాపోటీగా డెకరేషన్లు

గణేష్ ఉత్సవాలు అంటేనే మండపాల నిర్వాహకుల మధ్య విపరీతమైన పోటీ ఉంటుంది. ఎత్తైన విగ్రహం, ఆకర్షణీయమైన రూపం, వివిధ ఆకృతుల్లో మండపాల ముస్తాబు తదితర ఏర్పాట్లపై పోటీ పడుతున్నారు. మరికొందరు పండుగ పరమార్థాన్ని తెలిపే విధంగా భారీ సెట్టింగ్‌లతో మండపాలను తీర్చిదిద్దుతూ.. ప్రజలను ఆకర్శిస్తున్నాయి.



బిజినేపల్లి మండలం వెల్గొండలో ఆకట్టుకుంటున్న గణేష్ మండపం

ఆవంచలో ఏకశిలా గణపతి

దుందుభీ తీరంలో తిమ్మాజీపేట మండలం ఆవంచలో దేశంలోనే ఎత్తైన ఏకశిలా వినాయకుడి విగ్రహం ఉంది. తెలుగు నేలను పాలించిన ఇక్ష్వాకులు గణపతి భక్తులు కావడంతో క్రీ.శ.12వ శతాబ్దంలో దాదాపు 30 అడుగుల ఎత్తైన ఏకశిలా గణపతిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. స్థానికులు ఐశ్వర్య గణపతిగా పిలిచే ఈ గణనాథుడికి ఆలయం నిర్మాణం జరగకపోవడంతో ఈ విగ్రహం వందల ఏళ్లుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తోంది. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ఆవంచ గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

- నాగర్‌కర్నూల్



స్వాతంత్రోద్యమ స్ఫూర్తి రగిల్చేలా..



1940లో ప్రతిష్ఠించిన పాలరాతి గణేష్ విగ్రహం (ఫైల్)

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి రగిలించేందుకు బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుతో బాదేపల్లి పట్టణంలోని ప్రస్తుత గణేష్ మందిరంలో 1940లో తొలిసారిగా వినాయక ఉత్సవాలు ప్రారంభించారు. 84 ఏళ్లుగా ప్రతి ఏటా వినాయక ఉత్సవాలను నిరాటంకంగా కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం వినాయక ఉత్సవాలకు గణేష్ మందిరం ముస్తాబైంది. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గుండప్ప, కొత్తకేశవులు, జంగయ్యయాదవ్, పెరుమాళ్ల వెంకట్‌రెడ్డితోపాటు మరికొందరు 1940లో రేకుల షెడ్డు వేసి అందులో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఉత్సవ విగ్రహంతోపాటే అక్కడే పాలరాతి వినాయక విగ్రహాన్ని సైతం ప్రతిష్ఠించారు. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు అక్కడే సమావేశాలు నిర్వహించుకునేవారు. ఎవరైనా తనిఖీలకు వస్తే భజనలు చేస్తూ, కీర్తనలు పాడుతుండేవారు. స్వాతంత్ర్యం సిద్ధించాక నిజాం పాలన నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు ఉత్సవాలను కొనసాగించారు. ప్రారంభంలో ఊరంతా ఇక్కడికే వచ్చి ఉత్సవాల్లో పాల్గొనేవారు. కాలక్రమేణా గల్లీలో నాలుగైదు వినాయకులు ప్రతిష్ఠిస్తున్నప్పటికీ వినాయక నిమజ్జనంలో మాత్రం గణేష్ మందిరం వినాయకుడికే మొదటిస్థానం కల్పిస్తున్నారు. 1994 సంవత్సరంలో గుండప్ప మరణించాక ఆయన వారసులు ఆ ఉత్సవాలను కొనసాగిస్తున్నారు.

నిమజ్జనం ఎరుగని గణనాథుడు..



నారాయణపేట రూరల్: సాధారణంగా ఆలయాలు.. మండపాలు.. ఇళ్లల్లో చవితిరోజు ప్రతిష్ఠించిన వినాయకుడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి 5, 9, 11వ రోజుకు నిమజ్జనం చేయడం చూస్తుంటాం. కానీ, నారాయణపేటలోని పళ్లబుజుర్గ్ ప్రాంతంలోని దీక్షిత్ నివాసంలో దాదాపు 700 ఏళ్లకు పైగా గణనాథుడు నిమజ్జనం లేకుండా నిత్యపూజలు అందుకుంటున్నాడు. 13వ శతాబ్దానికి చెందిన గణనాథుడిని నాటి నుంచి వారి కుటుంబసభ్యులు కొలుస్తూ వస్తున్నారు. ఇక యేటా వినాయకచవితి నుంచి 11 రోజులు పెద్ద సంఖ్యలో భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



ఉత్తమ ఉపాధ్యాయులతో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఈఓ గోవిందరాజులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్, డీఈఓ గోవిందరాజులు హాజరయ్యారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాలకు ఉపాధ్యాయులే ఆదర్శమని, భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుడు అహర్నిశలు కృషిచేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు స్థానికంగా ఉంటూ విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, బాలికల భద్రతకే షీటీం పనిచేస్తోందని, ఎవరైనా వేధింపులకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన షీ టీం అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైంగిక వేధింపులు, దాడులు, యాంటీ ర్యాగింగ్, ఆత్మహత్యలు, సైబర్ క్రైం, టీ సేఫ్ అప్లికేషన్స్, బాలికల అక్రమ రవాణా తదితర వాటిపై అవగాహన కల్పించారు. మహిళల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో షీ టీంలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేసినా, ఎలాంటి ఆపద సమయంలోనైనా డయల్ 100, షీటీం 87126 57676 నంబర్‌కు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. షీ టీంను సంప్రదించడానికి వాట్సప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, క్యూఆర్ కోడ్ వినియోగించుకొని సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, సభ్యులు వెంకటయ్య, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజలకు సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో సీజనల్ వ్యాధులైన డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి జ్వరం డెంగీ కాదని, ప్రైవేటు ఆస్పత్రుల్లో అనుమానిత డెంగీ వ్యాధిగ్రస్తులను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపి రక్త నమూనాలు తెలంగాణ టీ డయాగ్నోస్టిక్‌కు పంపించి ఎలిసా టెస్టులో డెంగీ జ్వరంగా నిర్ధారించిన తర్వాతే రోగులకు చెప్పాలని సూచించారు. ప్రతి ప్రైవేటు క్లినిక్, ఆస్పత్రుల్లో, ల్యాబ్‌లలో ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, సేవలందిస్తున్న వైద్యుల పేర్లు, రిజిస్ట్రేషన్ నంబర్‌తో సహా రిసెప్షన్ కౌంటర్ దగ్గర ప్రదర్శించాలన్నారు. గర్భస్రావ చట్టం, పీసీ- పీఎన్‌డీటీ చట్టం అమలు తీరు గురించి వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ చెన్నయ్య, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, రాధిక, లక్ష్మణ్, రాజశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వెంకటదాస్, తారాసింగ్, భీమానాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో విద్యుత్ సమస్య తలెత్తొద్దు



ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

నాగర్ కర్నూల్: జిల్లా విద్యుత్ శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే బిజినేపల్లి మండలం పాలెం, తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న 33 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణకు సహకరించాలని వారిని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈకి సూచించారు. ఇందుకు తమ నుంచి విద్యుత్ శాఖ కావాల్సిన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఈ వెంట డీఈ జైపాల్ కిరణ్ తదితరులున్నారు.

ఇంకెన్నాళ్లీ వెట్టి చాకిరి..

- ఆర్థిక ఇబ్బందుల్లో పార్ట్‌టైం స్వీపర్లు
- ఏళ్లతరబడిగా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపులు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం



మార్చాలలో పాఠశాల శుభ్రం చేస్తున్న మహిళా స్వీపర్

కల్వకుర్తి రూరల్: తమకు మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా అని ఏళ్లతరబడిగా ఎదురుచూస్తున్న పార్ట్ టైం స్వీపర్లకు నిరాశే మిగులుతోంది. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని.. తద్వారా కనీస వేతనం లభిస్తుందని 30 ఏళ్లకు పైగా వెట్టి చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే చాలామంది మృత్యువాత పడగా.. మరికొందరు రిటైర్డ్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణలో ఒకేసారి నియామకమైనప్పటికీ 1994లో ఆంధ్రలో ఉన్నవారిని పర్మినెంట్ చేశారు. కానీ తెలంగాణలో ఉన్నవారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ఇప్పటి వరకు మోక్షం లభించలేదు. మొదట్లో వీరికి నెలకు రూ.150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతం అయినప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగం, పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందనే ఆశతో పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 169 మంది పనిచేస్తున్నారని స్వీపర్ల సంఘం నేతలు చెబుతున్నారు.

హై పవర్ కమిటీ వేసినా..

వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పార్ట్ టైం స్వీపర్లు చేసిన ఆందోళనతో 1992లో ప్రభుత్వం పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏపీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్ధీకరణకు అనుకూలంగా నివేదిక ప్రభుత్వానికి ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైం స్కేల్ ఇవ్వాలని పేర్కొంది. కానీ, ఆ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో పార్ట్ టైం స్వీపర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి ఏపీలో జీఓ 212 ద్వారా 1994లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్లే అని సంబరాలు చేసుకున్నారు. కానీ, ఆంధ్ర ప్రాంతంలో పనిచేసిన అధికారులు పార్ట్ టైం స్వీపర్లను పర్మినెంట్ చేయగా.. తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమాన్ని నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో పార్ట్ టైం స్వీపర్లకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖ అధికారులను మానవ హక్కుల సంఘం ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు వివరాలు తెప్పించుకున్న అధికారులు ఆ తర్వాత షరామామూలుగానే చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం పార్ట్‌టైం స్వీపర్లకు నెలకు రూ.5,200 వేతనం అందుతుంది. అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పర్మినెంట్ చేయాలి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక పార్ట్‌టైం స్వీపర్ల బతుకులు మారుతాయనుకున్నాం. కానీ, వారికి జీతాలు పెరగలేదు.. ఇతరత్రా మేలు జరగలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అప్పటి ప్రభుత్వం జారీ చేసిన 212 జీఓను వెంటనే అమలు చేసి పార్ట్‌టైం స్వీపర్లను వెంటనే పర్మినెంట్ చేయాలి.

– అంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్


చాలీచాలని వేతనంతో..



చాలీచాలని వేతనంతో దశాబ్దాల కాలంగా పార్ట్‌టైం స్వీపర్లుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. అనేక సార్లు ఆందోళన చేసినా.. కోర్టుకు వెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– ఫారుఖ్‌అలీ, స్వీపర్ల సంఘం డివిజన్ కార్యదర్శి, కల్వకుర్తి

శంకర సముద్రానికి భారీ వరద



వరద నీరు వస్తుండటంతో శంకరసముద్రం గల 5గేట్లను ఎత్తిన అధికారులు


కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు శంకర సముద్రానికి భారీగా వరద వస్తోంది. శుక్రవారం 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అధికారులు 5 గేట్లను రెండు ఫీట్లు పైకెత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. మరో రెండ్రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించడంతో వరద నీరు ప్రాజెక్టుకు భారీగా వస్తుందనే సమాచారం మేరకు ముందస్తుగా ప్రాజెక్టు గేట్లను ఎత్తినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు పరిసర గ్రామాలైన పాలెం, నిర్వేన్, దంతనూర్, శంకరమ్మపేట గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

రామన్‌పాడుకు 23 వేల క్యూసెక్కులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి శుక్రవారం వరద ఉధృతి పెరిగింది. కోయిల్‌సాగర్, మన్నెవాగు, ఊకచెట్టు వాగు వరదతోపాటు సరళాసాగర్, శంకరసముద్రం నుంచి 23 వేల క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. ముందుజాగ్రత్తగా ఐదు గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

సరళాసాగర్ నుంచి 10 వేల క్యూసెక్కులు..

మదనాపురం మండలం సరళాసాగర్ జలాశయం నుంచి శుక్రవారం 10 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుంది. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి జలాశయంలో నీటిమట్టం పెరిగింది. 4 ఉడ్ సైఫాన్ల నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా కొనసాగుతోంది. దీంతో మదనాపురం వాగు పారడంతో కొత్తకోట, మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలకు రాకపోకలు నిలిపోయాయి.



సరళాసాగర్ వద్ద నీటి ఉధృతి

క్లుప్తంగా

ట్రాలీ ఆటో కిందపడి చిన్నారి మృతి


కావేరి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆడుకుంటున్న చిన్నారి, ట్రాలీ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని పాపయ్యనగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడూరు మండలం చర్లఇటిక్యాలకి చెందిన మల్లేష్ జిల్లా కేంద్రంలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లేష్ కుమార్తె కావేరి(4) ఇంటి ముందు ఆడుకుంటుంది. అక్కడికి వచ్చిన టాటాఏస్ ట్రాలీ ఆటో డ్రైవర్ గమనించకుండా ఆటోను చిన్నారి పైనుంచి తీసుకెళ్లగా.. చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో డ్రైవర్ ట్రాలీ ఆటోను అక్కడే వదిలేసి పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. సుమారు 50 సంవత్సరాల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే రాజాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అవిఘ్నమస్తు..!

వినాయక చవితి పండగ వచ్చిందంటే చాలు.. వాడవాడలా వినాయక ప్రతిమలు వెలుస్తాయి. ప్రతి గల్లీలో సందడి నెలకొంటుంది.. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువత ఇలా అందరూ కలిసి జరుపుకొనే పండుగల్లో వినాయక చవితికి ఎంతో ప్రాధాన్యం ఉంది.. పల్లెలు.. పట్టణాలు, గల్లీల్లో యువత సంఘటితమై గణేష్ ఉత్సవాలు జరుపుకొంటారు. అయితే ఎలాంటి విఘ్నాలు ఎదురవకుండా ప్రశాంతంగా నిర్వహించాలంటే మాత్రం పోలీసుల శాఖ సూచనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంది. మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవడం మొదలుకొని.. విద్యుత్, ఫైర్ సేఫ్టీ, ఉత్సవాల ముగింపు నిమజ్జనోత్సవం వరకు ప్రతీది వారి కనుసన్నల్లో ముందుకు సాగితే.. నవరాత్రుల సంతోషం ఏడాదంతా ఉంటుంది. శనివారం వినాయక చవితి నేపథ్యంలో నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– మహబూబ్‌నగర్ క్రైం/ కల్వకుర్తి టౌన్


కల్వకుర్తిలోని విద్యానగర్‌కాలనీలో నవరాత్రి వేడుకలకు సిద్ధమైన వినాయక మండపం



- మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు తప్పనిసరి
- పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందే
- ప్రతి విగ్రహానికి జియో ట్యాగింగ్
- ఈసారి వేడుకలపై పటిష్ట నిఘా
- నేటినుంచి వినాయక చవితి నవరాత్రులు

వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రోడ్డు మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతాయి. రోడ్డు పక్కనే ఇబ్బంది కలగకుండా నిర్మాణం చేపట్టాలి. గణపతికి నిత్య హారతి, ధూప, దీపం సమర్పిస్తారు. ఇలాంటి సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి. వీలైతే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. మండపంలో వెలుతురుకు విద్యుత్ ముఖ్యం. మండపానికి విద్యుత్ లైట్లు అలంకరించే సమయంలో తీగలకు ఎలాంటి అతుకులు లేకుండా నాణ్యమైనవి వాడాలి. మండపాల చుట్టూ సీరియల్ బల్బులతో డెకరేషన్ చేయకూడదు. ఇందుకు ప్రధానంగా వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. ఒకవేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

అధిక ధ్వనులు ఇబ్బందికరం

నవరాత్రి ఉత్సవాల్లో భక్తి, భజన గీతాలు, మంత్రోచ్ఛరణాలు, పూజలు చేయడం తప్పనిసరి. అయితే పూజలు జరుగుతున్న సమయంలో డీజేలు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. మహబూబ్‌నగర్ పట్టణంలో డీజేలకు అధికారికంగా అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. పూజా సమయంలో కాకుండా రోజంతా భక్తి గీతాలు మోగించడంతో పరిసర ప్రాంతాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. కేవలం పూజ జరిగే సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మైకులు వాడుకొని తర్వాత నిలిపివేయాలని పోలీసులు సూచిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత పూర్తిగా ఆపివేయాలని చెబుతున్నారు.

పోలీసుల బందోబస్తు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గణేష్ మండపాల దగ్గర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక యూనిక్ ఐడీ

నవరాత్రుల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా, ఇబ్బందులు కలిగించేవి ఉంటే వెంటనే పరిష్కరించడానికి పోలీస్ శాఖ ప్రత్యేక నజర్ పెట్టింది. దీనికి గాను ప్రత్యేకంగా ఒక పోర్టల్ రూపొందించింది. వినాయక మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల నవరాత్రుల ప్రారంభోత్సవం నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు తదితర అంశాలను సులువుగా చేపట్టవచ్చని పోలీస్ శాఖ భావిస్తోంది. ఇలా పోలీస్ శాఖ అనుమతులే కాకుండా విద్యుత్, ఫైర్ శాఖల నుంచి పొందిన అనుమతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం రూపొందించిన https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వగానే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ కనిపిస్తుంది. అందులో వినాయకుడి మంటపం ఏర్పాటు చేసే నిర్వాహకుడి పేరు, పూర్తి వివరాలు, వినాయక మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

సూచనలు పాటించాలి..

వినాయక మండపాల ఏర్పాటులో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రూమర్స్ నమ్మరాదని, సందేహాలు ఉంటే సదరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలు పాటించాలి. పోలీస్ పోర్టల్ వివరాలను నమోదు చేసుకోవాలి. ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు అనేది సమాచారం ఉంటే బందోబస్తు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుంది.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

విద్యుత్‌తో జాగ్రత్త

మండపాల వద్ద విద్యుత్ సరఫరా కోసం గతంలో నిబంధనలను ఉల్లంఘించి తీగలకు వైర్లు వేసేవాళ్లకు ఈసారి దీనికి విద్యుత్ శాఖ చెక్ పెట్టింది. తప్పనిసరిగా మండపాల నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని ప్రకటించింది. అనుమతి పొందిన వారికి తామే సరఫరా కల్పిస్తామని, ఇందుకు కనీస చార్జీలు వసూలు చేస్తామని స్పష్టం చేసింది. మండపాల్లో మామూలుగా తీగలు వేలాడేలా ఉంచడం మంచిది కాదు. వర్షపు నీరు పడి విద్యుదాఘాతానికి గాని అగ్ని ప్రమాదానికి గాని దారితీస్తోంది.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు)కు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో కొనసాగనున్న జాతీయస్థాయి అసోసియేషన్ సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎంపికయ్యారని, వీరు తెలంగాణ తరఫున ఆడనున్నారని హెచ్‌ఎం తెలిపారు. ఆగస్టు నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు కల్వకుర్తిలో నిర్వహించిన క్యాంపులో అత్యంత ప్రతిభ కనబర్చిన 22 మందిని ఎంపిక చేయగా.. గోపాల్‌పేట పాఠశాల నుంచి వీరు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని నల్లాలబావి వద్ద శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడిగడ్డతండాకు చెందిన పాండు, సోనా, వెల్దండ మండలం జానలగట్టుతండాకు చెందిన భీమా, మంజుల, రాచూర్‌తండాకు చెందిన సక్రులు కల్వకుర్తి మండలం తర్నికల్‌తండాకు చెందిన బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి గురువారం వెళ్లారు. శుభకార్యం ముగిసిన తరువాత శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండలోని నల్లాలబావి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.

జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె


తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్న చిన్నోనిపల్లె గ్రామస్తులు


చిన్నోనిపల్లె ఇళ్ల మధ్యకు చేరుకున్న రిజర్వాయర్ బ్యాక్‌వాటర్

- గ్రామంలోకి చేరిన రిజర్వాయర్ బ్యాక్‌వాటర్
- తట్టాబుట్టా సర్దుకుంటున్న గ్రామస్తులు
- అధికారుల తీరుపై ఆగ్రహం
- తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకుని వెనక్కి పంపిన వైనం

గట్టు: ఇళ్ల ముందుకు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో ఆ ఇళ్లలో ఉండలేక, ఇల్లు విడిచి ఆరుబయట జీవనం సాగించలేక చిన్నోనిపల్లె వాసులు నరకయాతన పడుతున్నారు. ఇది చాలదన్నట్లుగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత ఆందోళన చెందుతూ ముంపు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ముంపు గ్రామస్తులను పలకరించేందుకు అధికారులు, నాయకులు అటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో చిన్నోనిపల్లె వాసులు మరింత ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు చిన్నోనిపల్లె చుట్టూ ఉన్న వాగులు పొంగి, రిజర్వాయర్‌లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చిన్నోనిపల్లెలోకి చేరుకున్నాయి. ఇప్పటికే కొంత మంది తట్టాబుట్టా సర్దుకుని బతుకు జీవుడా అంటూ కన్నీటితో ఊరికి వీడ్కోలు పలికారు. ఊళ్లోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ రావంటూనే తమను నిండా ముంచారని, కనీసం తల దాచుకునేందుకు కూడా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. గ్రామంలోని 350 ఇళ్లకు గాను ఇప్పటికే 70 ఇళ్లు నీటిలోకి చేరుకున్నట్లు తెలిపారు. ఆ ఇళ్లలో ఉండే వారు ఇళ్లను ఖాళీ చేసి, మరో చోటుకు చేరుకున్నారు.

అడ్డుకున్న గ్రామస్తులు..

గ్రామంలోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ చేరుకుని మూడు రోజులు గడిచినా.. కనీసం ఎలా ఉన్నారు. ఏం చేస్తున్నారని పలకరించే వారే లేరని, కష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాల్సిన అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. గ్రామ పరిస్థితులు తెలుసుకునేందుకు శుక్రవారం గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ సరితారాణి, ఆర్‌ఐ రాజు వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకుని తిప్పిపంపారు.

ఒక్కొక్కరుగా ఊరిని విడుస్తూ...

ఇంకా ఇప్పటి దాకా గ్రామంలో సగం మందికి పునరావాస కేంద్రంలోకి మారేందుకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించలేదు. పునరావాస కేంద్రంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించినప్పటికీ గత్యంతరం లేక చిన్నోనిపల్లె వాసులు ఒక్కొక్కరుగా ఊరిని విడిచిపెడుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మహిళ మృతి


అంజమ్మ (ఫైల్)

కోయిల్‌కొండ: మనికొండకి చెందిన అంజమ్మ(38) గురువారం సాయంత్రం పశువుల కోసం పేర్కివీడు శివారులోని ఓ రైతు పొలంలో గడ్డి కోసుకొని గడ్డిమోపు తలపై పెట్టుకొని వెళ్తుంది. ఈ క్రమంలోనే తీవ్రమైన గాలి, వాన రావడంతో అదే పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి ఎల్‌టీ వైరు తెగి అంజమ్మపై పడటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గుంతలో పడి వృద్ధుడు..


హన్వాడ: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. మండలంలోని గొండ్యాల్‌కు చెందిన చాకలి వెంకప్ప(60) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లోంచి వేపూర్ వైపు వెళ్లగా.. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న వేపూర్‌కు చెందిన ఆనంద్ వ్యవసాయ పొలంలోని నీటిగుంతలో పడి మృతిచెందాడు. మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకప్ప భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బాలస్వామి(50) అనే వ్యక్తి ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలస్వామితో తన భార్య స్వరూప నాలుగేళ్ల క్రితం గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బాలస్వామి తన తండ్రి లక్ష్మయ్యతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో లక్ష్మయ్య గురువారం తన కూతురిని చూడటానికి కుమ్మెర గ్రామానికి వెళ్లాడు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలస్వామి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు శుక్రవారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు, బంధువులు సమాచారం అందించారు. మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కాగా బాలస్వామి తన మొదటి భార్య మణెమ్మ మృతి చెందడంతో స్వరూపను రెండో వివాహం చేసుకున్నాడు.

జూరాలకు మళ్లీ వరద

- ప్రాజెక్టుకు 1.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 16 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల


ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. శుక్రవారం సాయంత్రానికి 1.36 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 16 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,12,848 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల నుంచి ఉత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 30,954 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 45 క్యూసెక్కులు ఆవిరవుతుండగా.. ఎడమ కాల్వకు 290 క్యూసెక్కులు, కుడి కాల్వకు 185 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.869 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. శుక్రవారం 11 యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువ 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు.. 139.126 ఎం.యూ., దిగువ 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 108.085 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 247.211 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని వివరించారు.









సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥ఎస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, పెద్ద లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228888, 83412 88888.

WANTED

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్సును చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ.18K. ఫోన్ 9840258888, 9840488888

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక



